ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 25: దేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 28న వరంగల్‌లో ఎల్‌బీ కాలేజీ జయసేన ఆడిటోరియంలో నిర్వహించే యువజన సమ్మేళనానికి హాజరు కావాలని ఆదివారం పలు విద్యార్థి, యువజన సంఘాల నాయకులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ.. యువజన సమ్మేళనానికి యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, నాయకుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 25: మైలార్‌దేవ్‌పల్లి, గ్రీన్‌విచ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు.. పల్లెచెరువు, గుమ్మడి వెంకట్‌రెడ్డి నగర్, మిలాన్ కాలనీ, అలీనగర్, కింగ్స్ అవెన్యూ, అహ్మద్ నగర్, హషామాబాద్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ

- రోజువారీగా ఇంటింటి చెత్త సేకరణ
- రోడ్లపై చెత్త వేయకుండా నిఘా..
- యూసుఫ్‌గూడలో 58 టీమ్‌ల ఏర్పాటు
- స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న సిబ్బంది

యూసుఫ్‌గూడలో ఓ హోటల్ వద్ద చెత్తను తొలగించక ముందు.. తరువాత (ఫైల్)

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25 : స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా గ్రేటర్ నగర పాలక సంస్థలో చెత్త సేకరణను ప్రణాళికా బద్ధంగా చేపట్టనున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లో 139 స్వచ్ఛ ఆటోలతో అధికారులు ఇంటింటి చెత్త సేకరణను మరింత పకడ్బందీగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 58 టీమ్‌లను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఆయా టీమ్‌లు స్వచ్ఛ ఆటోల సిబ్బందికి చెత్త సేకరణ పై అవగాహన కల్పించనున్నారు. రోడ్లపై చెత్త వేయకుండా సిబ్బందితో కలిసి గస్తీ చేపడుతున్నారు. సర్కిల్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ టీమ్‌లు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోనున్నాయి. సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఎస్ఎఫ్ఏలు, శానిటేషన్ సిబ్బందితో కలిసి నిఘా పెట్టనున్నారు.

పది జీవీపీలు తొలగింపు..

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 58 గార్బేజ్ వనరబుల్ పాయింట్లు(జీవీపీ) ఉండగా.. వాటిలో ఇటీవల పదింటిని తొలగించారు. ఈ మేరకు జీవీపీ ఎలిమినేషన్‌లో భాగస్వాములైన ఏడుగురు ఎస్ఎఫ్ఏలకు గుర్తింపు లభించింది. జీవీపీల తొలగింపునకు కృషి చేసిన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను స్వయంగా కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్ శనివారం ప్రశంసా పత్రాలతో అభినందించారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లలో మిగిలిన 48 జీవీపీల ఎలిమినేషన్‌పై అధికారులు దృష్టి పెట్టారు. నిబంధనలు అతిక్రమించి రోడ్లపై చెత్త వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 58 టీమ్‌ల ఏర్పాటు

రోడ్లపై చెత్త వేయకుండా సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 58 టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఆయా బృందాలు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లలో రోడ్లపై చెత్త వేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెడతాయి. స్వచ్ఛ ఆటో వెళ్లలేకపోవడం వల్ల రోడ్లపై చెత్త వేస్తున్నారా? స్వచ్ఛ ఆటో వెళ్లే సమయంలో సదరు ఇంటి యజమానులు ఉండటం లేదా? పరిశీలించి రెండో దశ కార్యాచరణ రూపొందిస్తారు. ఆయా బృందాలు ఇంటింటికీ వెళ్లి రోడ్లపై చెత్తవేసే వారికి అవగాహన కల్పిస్తారు. నిబంధనలు అతిక్రమించి రోడ్లపై చెత్త వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె ఎస్ రవి, ఏఎంఓహెచ్, యూసుఫ్‌గూడ సర్కిల్-19

క్రీడలతోనే మానసికోల్లాసం

క్రీడల్లో పాల్గొన్న ఉద్యోగులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 25 : క్రీడలు ఎంతో ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నిస్తాయని డీన్‌ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్ జెల్లా సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు పని వత్తిడిలో ఉంటారని, వీలైనంత వరకు వ్యాయామం, అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.

సాంస్కృతిక పోటీలు , సాహిత్యం తదితర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ నరేందర్‌రెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరం

వయోవృద్ధుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 25: వయోభారంతో పాటు మధుమేహం తదితర వ్యాధులతో ఇబ్బందులు పడే వయోవృద్ధుల సంరక్షణ విషయంలో కుటుంబసభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని ప్రముఖ జెరియాట్రిక్ స్పెషలిస్ట్ డా.వసంత్‌కుమార్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఆదివారం ఎల్డర్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ ఆలనాపాలనపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వయోవృద్ధులకు అందించాల్సిన ఆహారం, వైద్యం, మందులు, వారి మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డా.వసంత్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉచ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ ప్రతినిధులు సతీశ్, పవన్, ఎల్డర్ ఎయిడ్ ప్రతినిధి మందిరా జయసింహ పాల్గొన్నారు.

మోకాలి మార్పిడి చికిత్స గురించి అవగాహన కల్పించిన ఆర్థోపెడిక్ డాక్టర్ రంగనాథ్‌రెడ్డి

మోకాలి మార్పిడి చికిత్సపై అపోహలు వద్దు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 25: మోకాలి మార్పి డి చికిత్స గురించి ప్రజలు అపోహలను వీడాలని అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రంగనాథ్ రెడ్డి అన్నా రు. ఆదివారం వైద్యశాలలో ప్రజలకు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేండ్ల వ్యవధిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో ఆయన అవగాహన శిబిరంలో మాట్లాడారు. శస్త్ర చికిత్సతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రంగనాథ్ రెడ్డి కల్పించిన అవగాహనతో అనేక మంది బాదితులు శస్త్ర చికిత్సలకు సిద్ధం కావడం శుభ పరిణామమని నిర్వాహకులు తెలిపారు.

అన్నదానం..

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 247వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులను అప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. సభ్యులు మామిడి శ్రీవిద్య, నేహా, ఖుషి, జోషి, అకాంక్ష, సంతోషి, సుధ, గౌతమ్‌కృష్ణ, నిఖిల్, వివిన్‌రెడ్డి, అఖిల్, ఇర్ఫాన్, వంశీ, జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 25

ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి

బేగంపేట్, ఫిబ్రవరి 25: చిన్నారులను ఆసక్తి ఉన్న రంగాల్లో చిన్నతనం నుంచే ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ నెల 16న కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన జెక్ కాలనీకి చెందిన చిన్నారులతో ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో కోచ్ దేవేందర్, సిరి ఎలిజబెత్ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గోల్డ్ మెడల్ సాధించిన మోక్షిక రిత్విక్, సిల్వర్ మెడల్ సాధించిన మోక్షిత, కార్తిక్, లియోనా, శ్రీయాన్ ఇతర మెడల్స్ సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు. ఎంతో శిక్షణ ఇచ్చి మెడల్స్ సాధించే విధంగా కృషి చేసిన కోచ్‌లను ఎమ్మెల్యే అభినందించారు.

మెడల్స్ సాధించిన చిన్నారులతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

గ్యార్వీ ఉత్సవాలు..

బేగంపేట్, ఫిబ్రవరి 25: రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సిటీవైట్ చౌరస్తా వద్ద గౌసే పాక్ దర్గాలో ఆదివారం నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ పాతియా కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం నిర్వాహకులు ఫకీర్, జాకీర్, అమిత్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అరుణశ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌కుమార్, వినయ్, గౌరిశంకర్, సత్యనారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి

అత్తాపూర్, ఫిబ్రవరి 25: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ హుడా కాలనీలో యోదా లైఫ్ లైన్ డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరామ్‌రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, బాడీ ఫ్యాట్, బీఎంఆర్ తదితర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బాగి శ్రీనివాస్, శివకుమార్, భరత్‌సారంగి, శంకర్, మహేందర్‌రెడ్డి, రితేశ్, గంగాధర్, పవన్‌భరతి, డాక్టర్లు సేమసోని, దీపక్ గోయల్ పాల్గొన్నారు.

కులగణనతోనే బడుగులకు సముచిత న్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీ మనోహర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25 : కుల గణనపై అసెంబ్లీలో తీర్మానాన్ని ఆహ్వానిస్తున్నామని, బడుగులందరికీ సముచిత న్యాయం దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. ప్రజా తెలంగాణ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మేధావులు, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏండ్లలో బీసీల లెక్కలు పూర్తి స్థాయిలో బయటకు రాలేదన్నారు. సమగ్ర కుల గణన వల్ల ఆయా వర్గాల సామాజిక, విద్యా, సాంస్కృతిక, ఉద్యోగ, వృత్తిపరమైన సమాచారం దొరుకుతుందని, తద్వారా జనాభా దామాషా ప్రకారం వారికి లబ్ధి చేకూరుతుందన్నారు.

అక్రమ పదోన్నతులపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: రాష్ట్రంలోని వర్సిటీల్లో అధ్యాపకుల పదోన్నతుల అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. అక్రమాలపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారిని త్వరలో నియమించే వైస్ చాన్స్‌లర్ నియామకాల్లో పరిగణించకూడదని విజ్ఞప్తి చేశారు.

ఓయూ రిజిస్ట్రార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పదోన్నతుల అక్రమాలను సమర్థించుకునేందుకు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, అంబేద్కర్, జేఎన్టీయూ యూనివర్సిటీల్లో కొంతమంది ప్రొఫెసర్లు అర్హత లేకున్నా అవకతవకలకు పాల్పడి అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లు అయ్యారని ఆరోపించారు. ప్రస్తుతం యూనివర్సిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లను రద్దు చేయాలని డిమాం డ్ చేశారు. నూతన వీసీలను నియమించేందుకు ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలకు నామినీలను ప్రతిపాదించి, తిరిగి పదవులు పొందే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిని ప్రభు త్వం గమనించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్, రాధాకృ ష్ణ, అశ్వన్, హర్ష చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికార ప్రతినిధిగా కుమార్‌పవార్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 25: బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా వాంకడోత్ కుమార్‌పవార్‌ను నియమించారు. బోరబండ డివిజన్ వీకర్‌సెక్షన్‌లోని బ్రాహ్మణవాడి బస్తీకి చెందిన కుమార్‌పవార్‌కు పార్టీలో తగిన గుర్తింపు లభించడంతో ఆదివారం ఆయన నివాసానికి పలువురు వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా కుమార్‌పవార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఓ వైపు పోరాటం చేస్తూనే పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ తనపై నమ్మకంతో పదవిని అప్పగించారని తెలిపారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: ఫిలింనగర్ కొత్త చెరువు చుట్టూ వెలిసిన ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. ప్రధాన రోడ్డు వైపు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌తో పాటు బీజేఆర్‌నగర్ వైపు మొత్తం హోటళ్లు, పాన్‌షాపులు, జ్యూస్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, డబ్బాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఫిర్యాదులు అందుకున్న సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్‌సింగ్, షేక్‌పేట్ తాసీల్దార్ అనితారెడ్డి, జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి విశాల్ తదితరులు ఆదివారం పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీ సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. మరోసారి కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని షేక్‌పేట్ తాసీల్దార్ అనితా రెడ్డి హెచ్చరించారు.

ఫిలింనగర్ కొత్త చెరువు వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

సంత్ రవిదాస్ మహరాజ్ జయంతి

కార్యక్రమంలో మాట్లాడుతున్న టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 25 : అఖిల భారతీయ రవిదాసియా ధర్మ సంఘటన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య, అఖిల భారతీయ రవిదాసియా ధర్మ సంఘటన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజ్ కుమార్, సంజయ్‌కంబ్లే, కోశాధికారి కౌలస్కర్ ప్రకాశ్, సమగర (మోచీ) కుల సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ సీహెచ్ రాజమౌళి, ఆర్. వాగ్మరే, ఎస్. దశరథ్, మాస భాస్కర్, రవీందర్, దేవరకొండ నోమురాజ్, రవిచందర్, దేవేందరప్ప, రమేశ్, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్ సిక్‌చానీలోని గురుద్వారాలో శ్రీ గురు హరై సాహెబ్ జీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గురుద్వారాలో నిర్వహించిన ప్రార్థనల్లో చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ జఫీర్, అహ్మద్, షానవాజ్, షకీల్, ఆజీజ్, సిక్కు సోదరులు పాల్గొన్నారు.

– అత్తాపూర్, ఫిబ్రవరి 25

రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 25 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణకు తెర లేపిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాల మహానాడు రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలలు, మాదిగలు కలిసి ఉన్నారని, వీరిని విభజించాలని కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎన్‌రావు, నాయకులు భాస్కర్‌రావు, రాజు, దేవేందర్, ప్రవీణ్, టి.బాలస్వామి పాల్గొన్నారు.

గ్రహణ మొర్రి చిన్నారులకు డ్రీమ్ అన్‌లిమిటెడ్ కార్యక్రమం

డ్రీమ్స్ అన్‌లిమిటెడ్ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన చిన్నారులతో నిర్వాహకులు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 25: గ్రహణ మొర్రి సమస్యలతో బాధపడే చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు బసవతారకం స్మైల్ ట్రైన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'డ్రీమ్స్ అన్‌లిమిటెడ్' పేరుతో థియేటర్ వర్క్‌షాపు నిర్వహించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారుల్లో దాగిన ప్రతిభను వెలికి తీసేలా నాటికలు ప్రదర్శించారు. సరైన రీతిలో మాట్లాడటం, బాడీ లాంగ్వేజ్‌ను మెరుగుపర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై నాలుగురోజుల పాటు శిక్షణ అందించామని స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.డి.ముకుంద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ కొంపి, మమత కరోల్, అర్చనా సురేశ్, డా.కేవీవీ ఎన్.రాజు పాల్గొన్నారు.

ఎస్‌టీఎస్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్ఏ) ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏడాది పాటు ప్రజా రాజ్యాధికార ఉత్సవం పేరుతో రూపొందించిన క్యాలెండర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మనోజ్, ప్రసాద్, హరికృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గీతాజ్ఞాన యజ్ఞం

సనాతన బ్రహ్మజ్ఞాన మహాసభలు గీతాజ్ఞాన యజ్ఞం 45వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని మారుతీనగర్ హనుమాన్ దేవాలయం వద్ద నిర్వాహకులు సుక్క విజయలక్ష్మి, మల్లేశ్ దంపతుల ఆధ్వర్యంలో మహాయజ్ఞాన్ని నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే ఈ మహాయజ్ఞంలో వందలాది మంది భక్తులు పాల్గొని మహాయజ్ఞాన్ని నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుక్క భవాని, మల్లేశ్ దంపతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

– అడ్డగుట్ట, ఫిబ్రవరి 25

దళితులకు రిజర్వేషన్లు పెంచాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 25: దళితులకు రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం సుమన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభాకు అనుగుణంగా 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండి అజయ్‌మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీకాంత్ మాదిగ, డబ్బా రాజు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 25: రైలు ఢీ కొని ఓమహిళ మృతి చెందింది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం..ఆదివారం తెల్లవారు జామున జామైఉస్మానియా, విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని గుర్తు తెలియని మహిళ(50) మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.